
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
సోమవారం 20 మే 2024



రాజన్న క్షేత్రానికి పెరిగిన భక్తుల తాకిడి - 8లో..

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి - 8లో..



'పంచాయతీ' వైపు ఆశావాహుల చూపు

- ఇంకా ఎన్నికలపై వీడని సందిగ్ధం
- ఎన్నికల నిర్వహణకు అధికారుల కసరత్తు
- జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు, 2,240 వార్డులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల తీర్పు ముగిసి ఈవీఎంల నుంచి ఫలితాలు ఎలా రాబోతున్నాయనే ఉత్కంఠత ఒకవైపు ఉన్నా రాజన్న సిరిసిల్ల జిల్లాలో లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాల్లో పనిచేసినా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర సామాజిక వర్గాల ప్రతినిధులు స్థానిక సంస్థల ఎన్నికల వైపు దృష్టి సారించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టడంతో పల్లెల్లో ఆశావాహులు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీంతో గ్రామాల్లో మళ్లీ ఎన్నికల సందడి కనిపిస్తోంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు 2240 వార్డులుఉన్నాయి. వీటికి సంబంధించి ఎన్నికల కమిషన్ ఏ సమయంలో షెడ్యూల్ జారీచేసినా ఎన్నికలు నిర్వహించడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండే విధంగా ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. ఇప్పటికే ఎన్నికల కమిషన్ పోలింగ్ సిబ్బంది వివరాలు, ఓటర్ల లెక్కలు తీసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2019 జనవరిలో మూడు విడతల్లో జరిగిన ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లపై దృష్టిపెట్టారు. 200 మంది ఓటర్లతో ఉండే విధంగా బూత్ ఏర్పాటు చేసి ఒక ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న బూత్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 400 నుంచి 650 మంది ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించుకునే విధంగా టీ పోల్ సాఫ్ట్‌వేర్‌లో వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వం ఎన్నికలపై దృష్టిపెట్టినా గ్రామాల్లో మాత్రం సందిగ్ధం వీడడం లేదు.

● విలీన గ్రామాలు పంచాయతీలుగా మారేనా..

శాసనసభ ఎన్నికల్లో గతంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో విలీనం చేసిన గ్రామాలను పంచాయతీలుగా మారుస్తామని అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చారు. దీని ప్రకారం సిరిసిల్ల, మున్సిపాలిటీలో విలీనమైన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్థాపూర్‌లను గ్రామ పంచాయతీలుగా ప్రకటించాలని తీర్మానాలు కూడా చేశారు. విలీన గ్రామాల్లో నెలకొన్న అసంతృప్తిని తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం రాబోయే ఎన్నికల్లో గ్రామ పంచాయతీ ప్రక్రియను చేపడుతారా అనే చర్చ జరుగుతోంది.

● పాలకవర్గాలు లేకుండానే గడిచిపోయిన పంచాయతీలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉప ఎన్నికలు లేకుండానే పంచాయతీ కాలం గడిచిపోయింది. అరు సర్పంచ్ స్థానాలు, 88 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన సాగింది. చివరకు కొన్ని గ్రామ పంచాయతీల్లో ఐదేండ్ల కాలం గడిచిపోగా మరికొన్ని రెండు సంవత్సరాలకు పైగా ఖాళీగానే ఉండిపోయాయి. 2019లో సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించిన ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ ప్రజలు పట్టువీడకపోవడంతో ఐదేండ్ల కాలం గడిచిపోయింది. వీటితో పాటు జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా వివిధ కారణాలతో 45 గ్రామ పంచాయతీల పరిధిలో 94 స్థానిక సంస్థల ఖాళీల్లో ఆరు సర్పంచ్ స్థానాలు, 88 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. ఈ సారి కూడా సకాలంలో ఎన్నికలు జరగకపోవడంతో అ గ్రామాల్లో అసంతృప్తి మాత్రం వీడడం లేదు.

● రిజర్వేషన్లే ఆటంకం కానున్నాయా..?

కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రెండు పర్యాయాలు కొనసాగే విధంగా రిజర్వేషన్లు ఖరారు చేసినా ఈ సారి రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేసింది. అందులో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించింది. అ విధానంలోనే 2019లో ఎన్నికలు నిర్వహించారు. బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడంపై రాష్ట్ర హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు ప్రభుత్వాన్ని కూడా రిజర్వేషన్లు తగ్గించడంపై ప్రశ్నించింది. ఈ పరిస్థితుల్లో రిజర్వేషన్ల ప్రక్రియతో ఎన్నికలు మరో మూడు నెలలపాటు వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలోని పంచాయతీల్లో మేజార్టీ స్థానం 50 శాతం రిజర్వ్‌లో మహిళలకే స్థానాలు లభించాయి. 2011 జనాభాను పరిగణలోకి తీసుకోని ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు నిర్థారించారు. ప్రస్తుతం రిజర్వేషన్ల పక్రియ ముందుకు రావడంతో ఆశావాహుల్లో రిజర్వేషన్ల కారణాలపై కూడా అయోమయం నెలకొంది.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



కేంద్రంలోని వాహనం వద్ద రైతులు, డైరెక్టర్

ఎల్లారెడ్డిపేట, మే 19: మండలంలోని అల్మాస్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని దుమాల, బుగ్గరాజేశ్వరతండా గ్రామాల్లో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు ఆదివారం ముగిశాయి. బుగ్గరాజేశ్వర తండాలో 76 మంది రైతుల నుంచి 6300 క్వింటాళ్లు, దుమాలలో 152 మంది రైతుల వద్ద 11600 క్వింటాళ్ల ధాన్యం సేకరించామని సంఘం సీఈవో సతీష్ తెలిపారు. కొనుగోళ్లను వేగవంతం చేయడానికి సహకరించిన డైరెక్టర్లు, నిర్వాహకులు, రైతులు, హమాలీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తంగళ్లపల్లి, మే 19: తంగళ్లపల్లి గ్రామ పంచాయతీలో ఆవరణలో భవన నిర్మాణ సంఘం, కార్మిక శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. భవన నిర్మాణ శాఖ సంబంధిత కార్డు కలిగిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్లడ్, యూరిన్‌శాంపిల్స్ సేకరించారు. కార్యక్రమంలో క్యారం జగత్, విశ్వనాధుల రమేష్, తెంబరవేణి శ్యామ్, వైద్య బృందం పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ ఎన్నికలపై పార్టీల సమాయత్తం

- డైరెక్టర్ స్థానాలపై కౌన్సిలర్ల చూపు - బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఆశావాహుల సమావేశాలు





సిరిసిల్లలో సమావేశమైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల నోటిఫికేషన్ 22వ తేదిన వెలువడనుండడంతో ఎన్నికల బరిలో నిలిచే అశావాహులు అందుకు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మరోవైపు పార్టీల మద్ధతును కూడగట్టుకోవడానికి సిద్ధమయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో జెండా ఎగురవేయడానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు దృష్టి పెట్టాయి. ఈ క్రమంలో అశావాహులతో అదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అధ్యక్షతన సమావేశమయ్యారు. బ్యాంక్ సిట్టింగ్ చైర్మన్ గడ్డం విఠల్, గ్రంధాలయ మాజీ చైర్మన్ అకునూరి శంకరయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి మ్యాన రవితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు సమావేశం అయ్యారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మాజీ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, అకునూరి బాలరాజు, యెల్లె లక్ష్మీనారాయణతో పాటు ముఖ్య నాయకులు సమావేశమై చర్చలు జరిపారు. సిరిసిల్ల పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అర్బన్ బ్యాంక్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 11 మంది సభ్యులతో ఎన్నికల కమిటీని నియమించారు. అర్బన్ బ్యాంక్ సిట్టింగ్ డైరెక్టర్లు, గతంలో పోటీ చేసి ఓడిపోయిన వారు సైతం మళ్లీ బరిలో ఉండడానికి సిద్ధమై సమావేశాలకు వచ్చారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలోని ముఖ్యులు అవకాశం ఇవ్వాలని కోరారు. అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి 12 డివిజన్లలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు ఒక స్థానం (ఐదో వార్డు), ఇద్దరు మహిళలకు (7, 10 వార్డులు) రిజర్వ్ చేశారు. జనరల్ స్థానాలుగా 1, 2, 3, 4, 6, 8, 9 11, 12 వార్డులు ఉన్నాయి. ఇప్పటికే షెడ్యూల్ విడుదల కాగా నోటిఫికేషన్ 22న జారీ చేయనున్నారు. 27 నుంచి 29 వరకు మూడు రోజులు నామినేషన్ల ప్రక్రియ ఉండడంతో పోటీ పడే అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

● సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల వైపు కొందరు కౌన్సిలర్లు కూడా అశలు పెంచుకుంటున్నారు. మున్సిపల్ పాలకవర్గం గడువు కొద్ది రోజులే ఉండడంతో అర్బన్ బ్యాంక్ చైర్మన్, డైరెక్టర్ స్థానాలవైపు దృష్టి పెట్టారు. 517 మంది మాత్రమే డివిజన్లలో ఓటర్లు ఉండడంతో సులువుగా గెలుపొందవచ్చనే ఆలోచనలో ఉన్నారు. ప్రజాప్రతినిధిగా ఉండే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు. స్వతంత్రంగానే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏకగ్రీవాలు కూడా చేసుకోవచ్చని భావిస్తున్నారు. దీంతో సిరిసిల్లలో అర్బన్ ఎన్నికల సందడి అసక్తిగా మారింది.



నాయకులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

మృతదేహాన్ని త్వరగా భారత్‌కు పంపించాలి

- దుబాయి కంపెనీ ప్రతినిధులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మే 19: జగిత్యాల జిల్లా భీమారం మండలం మోత్కురావుపేట గ్రామానికి చెందిన భూమళ్ల గణేష్ ఇటీవల దుబాయిలో అకాల మరణం చెందడంతో మృతదేహాన్ని త్వరగా భారత్‌కు పంపించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సదరు కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. దుబాయి పర్యటనలో భాగంగా మృతి చెందిన గణేష్ కంపెనీకి ఆదివారం వెళ్లి కంపెనీ క్యాంపస్‌కు వెళ్లి ప్రతినిధులతో మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. క్యాంపస్ బాస్ విజయ్‌తో కలిసి సదరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి గణేష్ మృతికి సంబంధించిన రిపోర్టును త్వరగా సిద్ధం చేసి ఇప్పించాలని పోలీస్ అధికారులను విజ్ఞప్తి చేశారు. గణేష్ మృతి కేసును ఫాలోఆప్ చేస్తున్న జీడబ్ల్యూఏసీ ఉపాధ్యక్షుడు కోరెపు మల్లేశ్‌తో కంపెనీ హెచ్‌ఆర్ టీమ్‌తో సమన్వయం చేసి మృతదేహాన్ని త్వరగా స్వగ్రామం పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరినట్లు తెలిపారు.

దుబాయిలో ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌కు సన్మానం

ఎల్లారెడ్డిపేట, మే 19: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దుబాయి పర్యటనలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ రాధారపు సత్యం ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ప్రవాసీ భారతీయుల సమస్యలను ఆది శ్రీనివాస్‌కు వివరించానని రాధారపు సత్యం పేర్కొన్నారు.

నిర్వాసితులు ఉపాధిపై దృష్టిసారించాలి



అవగాహన కల్పిస్తున్న మిత్ర ఫౌండేషన్ నిర్వాహకురాలు ఇంద్రారెడ్డి

వేములవాడ టౌన్, మే 19: మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితులు ఉపాధి రంగంవైపు మొగ్గు చూపాలని మిత్ర ఫౌండేషన్ నిర్వాహకురాలు ఇంద్రారెడ్డి సూచించారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో డీఎస్పీ నాగేంద్రచారి సూచనలతో నిర్వసితులకు అవగహన కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యమానేరులో తమ ఉపాధిని కోల్పోయిన నిర్వసితులు చిన్న చిన్న ఉపాధి రంగాలపైన దృష్టిసారించి లాభాలను ఆర్జించాలని అన్నారు. తేనెటీగల పెంపకంతో ఎంతో లాభాలు ఉన్నాయని, తేనేటీగల పెంపకంపై నిర్వాసితులు అవగహన కలిగి ఉండాలని సూచించారు. ఇతర ఉపాధి అవకాశాలపై చర్చించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, మాజీ సర్పంచ్‌లు ఊరడి రాంరెడ్డి, పిల్లి కనుకయ్య, మాజీ ఎంపీటీసీ వంకాయల భూమయ్య, నాయకులు నిర్వసితులు రాజిరెడ్డి, నడిగొట్ల హరికృష్ణ, బెజుగం మహేష్, కనుకరాజు, కాసర్ల అరుణ్, గ్రామస్థులు ఉన్నారు.

అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

సిరిసిల్ల రూరల్, మే 19: సిరిసిల్లలో జూన్ 6 జరిగే సిరిసిల్ల కో అపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ సత్తాను చాటేందుకు నాయకులు, కార్యకర్తలు డైరెక్టర్ల గెలుపుకోసం అహర్నిశలు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం పట్టణ కమిటీ సమావేశం పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అధ్యక్షతన అర్బన్ బ్యాంక్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 11 మంది సభ్యులతో ఎన్నికల కమిటీని వేసినట్లు జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అర్బన్ బ్యాంక్‌పైన కాషాయం జెండా ఎగరాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా 11 మందితో కమిటీని వేశారు. కమిటీలో రెడ్డబోయిన గోపి, అడెపు రవీందర్, నాగుల శ్రీనివాస్, శీలం రాజు, గూడూరి భాస్కర్, బొల్గం నాగరాజు గౌడ్, పత్తిపాక సురేష్, దుమాల శ్రీకాంత్, బర్కం లక్ష్మి, అన్నల్‌దాస్ వేణులను నియమించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ అడెపు రవీందర్, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, బర్కం నవీన్‌యాదవ్, దుమాల శ్రీకాంత్, శీలం రాజు, చేపూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభీష్టం మేరకే మాన్యువల్ తూకాలు

ముస్తాబాద్, మే 19: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎలక్ట్రానిక్ కంటాలు రిపేరు అవుతున్న నేపథ్యంలో రైతుల ఇష్టం మేరకే మాన్యువల్ తుకాలు చేపట్టామని ముస్తాబాద్ సహకార సంఘ సీఈవో అనమేని బాలయ్య ఆదివారం పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ముస్తాబాద్ సహకార సంఘ పరిధిలో ఈ సీజన్‌లో 1500 మంది రైతుల వద్ద నుంచి 76 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఎలాక్ట్రానిక్ కాంటాలు గతంలో రిపేరుకు పోయిన నేపథ్యంలో ధాన్యం తడుస్తున్నాయనే రైతుల ఆవేదనతో మాన్యువల్ కాంటాలు పెట్టి త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్





సిరిసిల్ల, వేములవాడలో పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజాఉద్యమాలను చేపట్టడంతోపాటు అయన ఆశయ సాధనలో త్యాగాలను నేర్చుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో అదివారం సీపీఎం జిల్లా కమిటీ అధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా తన కుటుంబంలోనే సాంఘిక సంస్కరణ ఉద్యమాన్ని ప్రారంభించిన మహానీయుడు సందరయ్య అని కొనియాడారు. తనవాటకు వచ్చిన అస్థిని మొత్తాన్ని పేద ప్రజలకు పంపిణీ చేసిన గొప్ప నిస్వార్థ జీవి సందరయ్య అని అన్నారు. నేటి భూర్జువ రాజకీయ నాయకుల్లో స్వార్థం అణిచివేత దోపిడీ వంటి లక్షణాలు పెరిగి ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. నాటి సుందరయ్య లాంటి నాయకులు ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేయడమే కాకుండా విలువల కోసం తుది శ్వాస వరకు నిలబడ్డారని వివరించారు. ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేష్, నక్కదేవదాస్, ఎలిగేటి రాజశేఖర్, బెజిగం సురేష్, వడ్నాల వీరేశం, సురేష్, బింగి సంపత్, స్వర్గం శేఖర్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

● ప్రస్తుత పాలకులకు దిక్సూచి..

తంగళ్లపల్లి: ప్రస్తుత పాలకులకు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం దిక్సూచి అని సీపీఎం మండల కార్యదర్శి కోడం రమణ అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని కొనియాడారు. సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టి కూడా చిన్ననాటి నుంచే అంటరానితనం, కుల వివక్ష, అసమానతలను సహించేవాడు కాదని గుర్తు చేశారు. అసమానతలను తొలగించాలని ఆయన తనకు వారసత్వంగా వచ్చిన వచ్చిన భూమిని పేద ప్రజలకు పంచిపెట్టారని, అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే పిల్లలను కూడా వద్దని నిర్ణయం తీసుకున్న గొప్ప త్యాగ దంపతులు అన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడని ఆయన ప్రజా ప్రతినిధిగా పలు పర్యాయాలు ఎన్నికై అసెంబ్లీకి, పార్లమెంటుకు కూడా సైకిల్‌పై వెళ్లిన నిరాడంబర నాయకుడని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో స్వార్ధ రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రజానీకం చైతన్యవంతులై సుందరయ్య లాగా నిస్వార్ధంగా, నిరాడంబరంగా ఉంటూ ప్రజాసేవ చేసే నాయకులకు అధికారం కట్టబెట్టాలని అప్పుడే దేశంలో అసమానతలు తొలగిపోతాయని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుడిక్యాల కనకయ్య, అన్నల్దాస్ గంగాధర్, లింగంపెల్లి కృష్ణవేణి, కోడం వేణు, సామల నర్సయ్య, అవధూత హరిదాసు, మూషం శంకర్, రాజమల్లు, రాజేశం, శంకరయ్య, కనకరాజు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం వేములవాడ పట్టణంలోని పార్టీ కార్యలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జివ్వాజి విమల, ముక్తికాంత అశోక్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

● పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగించాలి

కోనరావుపేట: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జవ్వాజి విమల కోరారు. కోనరావుపేటలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆయన పలుసార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజలకు సేవలు అందించారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం కృషి చేశారని అన్నారు. తనకున్న ఆస్తులను కూడా పేదలకు పంపిణీ చేశారని అన్నారు. అలాంటి గొప్ప మహనీయుని ఆశయాలను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్య, నర్సవ్వ, సులోచన, పావని, గాయత్రి, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై గృహహింస కేసు నమోదు

నెన్నెల, మే 19: అదనపు కట్నం కోసం వేధించిన ఐదుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. నెన్నెలకు చెందిన మౌనిక (హరిత)తో పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లికి చెందిన నాగులమల్యాల రాజుతో 2023లో పెళ్లి జరిగింది. కట్నకానుకలు ఇచ్చి వివాహాన్ని ఘనంగా జరిపిం చారు. వివాహమైన 15 రోజుల నుంచే అదనపు కట్నం తేవాలని భర్త రాజు చిత్రహింసలు పెట్టేవాడని పేర్కొన్నారు. అత్త అమ్మాయి, మామ ఆనందం, ఆడపడుచు బ్రహ్మోజు స్వప్న, ఆమె భర్త రవిబాబు సైతం మౌనికను మానసికంగా వేధించేవారని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

కూతురిని కడతేర్చిన తల్లిదండ్రుల అరెస్ట్

● మానసిక స్థితి బాగాలేదని కూతురికి ఉరివేసి హత్య ● వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 19: కన్నకూతురును కడతేర్చిన తల్లిదండ్రులు కటకటాలపాలైన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామంలో జరిగింది. జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామంలో కూతురి మానసిక స్థితి బాగాలేదని ఎలాగైనా వదిలించుకోవాలని భావించి ఈ నెల 14న అర్ధరాత్రి ఇంట్లోనే ఉరివేసి హత్యచేశారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో హత్యకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు... తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన చెప్యాల ఎల్లవ్వ, నర్సయ్య దంపతులకు ప్రియాంక(24) ఏకైక కుమార్తె. ప్రియాంక ఈ నెల 14న మృతి చెందింది. ఆమె మృతిపై గ్రామస్థులకు అనుమానాలు రావడంతో ఆ సమాచారాన్ని తెలుసుకున్న గ్రామ కార్యదర్శి రాజు తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా కన్నకూతురి మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్ల తల్లిదండ్రులే ఉరివేసి హతమార్చారని తేలింది. కూతురు ప్రియాంక మానసిక వ్యాధితో బాధపడుతూ మృతిచెందినట్లు చిత్రీకరించి భర్తకు సమాచారం అందించి మృతదేహాన్ని ఆమె అత్త వారి గ్రామమైన దర్గపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. ప్రియాంక మృతిపై అనుమానం వెల్లువెత్తడంతో ఆమె తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా సంఘటన గుట్టురట్టయింది. నేరెళ్ల గ్రామానికి చెందిన చెప్యాల ఎల్లవ్వ, నర్సయ్య దంపతులకు ప్రియాంక ఏకైక కుమార్తె. ఏడేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. కుమార్తె ప్రియాంకను తల్లిదం డ్రులు ఆస్పత్రులలో చికిత్స చేయించగా కొంత వ్యాధి నయమైంది. దీంతో ప్రియాంకకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని దర్గపల్లి గ్రామానికి చెందిన పృధ్వీ అనే వ్యక్తితో 2020లో పెళ్లిచేశారు. వివాహం అనంతరం ప్రియాంక, పృధ్వీ దంపతులు జీవనోపాధి కోసం కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో నివాసం ఉన్నారు. వీరికి 13 నెలల కుమారుడు ఉన్నాడు. నెల రోజులుగా ప్రియాంక మళ్లీ మానసిక వ్యాధితో బాధపడుతూ అందరిని ఇబ్బంది పెట్టడమే కాకుండా కుమారుడిని కొట్టి కిందపడేయడం చేస్తుందని ఆమె భర్త పృధ్వీ అత్తమామలైన ఎల్లవ్వ, నర్సయ్యలకు చెప్పాడు. దీంతో కూతురు ప్రియాంకను కరీంనగర్ నుంచి నేరెళ్లకు తీసుకువచ్చిన తల్లిదండ్రులు బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం వద్ద వ్యాధి నయం అవుతుందని మూడు రోజులు ఉంచినా ఎంతకీ నయం కాలేదు. విసిగిపోయిన తల్లిదండ్రులు ప్రియాంకను నేరెళ్ల గ్రామానికి తీసుకువచ్చారు. కూతురు మానసిక వ్యాధి నయం కోసం చికిత్స కోసం తిరగడంతో తల్లిదండ్రులకు అప్పులు పెరిగాయి. దీంతో ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలనుకున్న తల్లిదండ్రులు ఈ నెల 14న అర్ధరాత్రి ప్రియాంక ఇంట్లో నిద్రిస్తుండగా నూలు దారంతో ఉరివేసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని ఎస్పీ చెప్పారు. ఈ మేరకు కన్నకూతురిని హత్యచేసిన తల్లిదండ్రులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఈ హత్యను గ్రామస్థుల సమాచారం మేరకు ఛేదించామని వివరించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రూరల్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

రామగుండంలో రూ.4కోట్ల చెక్కులు వాపస్

● 5శాతం ఇస్తే బిల్లులు పాస్ ● ఏడాదిగా ట్రెజరీల చుట్టూ తిరుగుతున్న కార్పొరేషన్ కాంట్రాక్టర్లు

కోల్‌సిటీ, మే 19: రామగుండం నగరపాలక సంస్థలో గత ఏడాది అభివృద్ధి పనులు చేసి చెక్కులు తీసుకున్న కాంట్రాక్టర్లకు బిల్లులు పాస్‌కాలేదు. ఏడాది పాటు ట్రెజరీల చుట్టూ తిరిగిన కాంట్రాక్టర్లకు ఆర్థిక సంవత్సరం ముగియడంతో చెక్కుల గడువు ముగిసిందంటూ వాపసు పంపారు. రామగుండం నగరపాలక సంస్థకు చెందిన రూ.4కోట్ల చెక్కులు వాపసు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 14వ ఆర్థిక సంఘం, ఎస్సీ సబ్‌ప్లాన్, పట్టణ ప్రగతి, ఏసీడీపీ నిధులకు చెందిన చెక్కులు ఉన్నాయి. ఇందులో కేవలం పట్టణ ప్రగతికి సంబంధించే రూ.3కోట్ల బిల్లులు ఉండగా 14వ ఆర్థిక సంఘంకు సంబంధించి రూ.1కోటి ఉన్నాయి. చివరికి నియోజకవర్గ అభివృద్ధి నిధులకు సంబంధించి ఏసీడీపీ చెక్కులు కూడా పాస్‌కాలేదు. రామగుండంలో రూ.40లక్షల ఏసీడీపీ చెక్కులు కూడా వాపసు వచ్చాయి. రామగుండం నగరపాలక సంస్థలో మే 2023 నుంచి బిల్లులు పాస్‌కావడం లేదు. మే 2023 నుంచి మార్చి 31, 2024వరకు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 143పనులకు సంబంధించి బిల్లులు పాస్‌కాలేదు. ట్రెజరీలో, సంబంధిత హెడ్‌లలో నిధులు లేవనే కారణంగా వీటిని పెండింగ్‌లో పెట్టారు. దీంతో అప్పులు తెచ్చి పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు వాపసు రావడంతో లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఏడాది వడ్డీలు మీద పడ్డాయని, ఇంకా జాప్యం జరిగితే పెట్టుబడులు పూర్తిగా నష్టపోతామని వాపోతున్నారు.

● రామగుండం నగరపాలక సంస్థకు సంబంధించి వివిధ స్కీముల బిల్లులు పాస్ చేయడంలో ఆర్థికశాఖలో అవకతవకలు చోటుచేసుకుంటున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో బిల్లుపై 5శాతం కమీషన్ ఇస్తే బిల్లులు పాస్ చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఒకే స్కీముకు సంబంధించి కొందరి కాంట్రాక్టర్ల బిల్లులు మే, 2023 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. అదే స్కీముకు సంబంధించి 2024లో పనులు చేసి మార్చిలో చెక్కులు తీసుకున్న కాంట్రాక్టర్లు హైదరాబాద్‌లోని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో పైరవీలు చేయించుకుంటే బిల్లులు పాసయ్యాయని, తమ బిల్లులు మాత్రం పెండింగ్‌లో పెట్టారని ఆరోపిస్తున్నారు.

ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ మృతి

హుజూరాబాద్, మే 19: హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయ కాలనీకి చెందిన అల్లి మహేందర్ (58) అనే ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అల్లి మహేందర్‌కు శనివారం రాత్రి ఛాతీలో నొప్పిగా ఉండడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మహేందర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎల్ఐసీ ఏజెంట్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు.

రూ.300 అపరాధ రుసుముతో పాలిసెట్ దరఖాస్తుకు చివరిరోజు నేడు

కరీంనగర్ టౌన్, మే 19: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-24కు దరఖాస్తు చేసుకునేందుకు రూ.300 అపరాధ రుసుముతో సోమవారం చివరిరోజని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ ఆవాస మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనుమతి లేని పాఠశాలల పేర్లు ప్రకటించాలి

భగత్‌నగర్, మే 19: జిల్లాలో అనుమతి లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయాలని ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రమేష్‌లు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయకుండా గుర్తింపు ఉన్న పాఠశాలల్లో మాత్రమే తమ పిల్లల్ని చదివించాలని ప్రకటించిన డీఈఓ ప్రకటన సరైంది కాదన్నారు. జిల్లాలో అనుమతి లేని పాఠశాలల పేర్లు ప్రకటించాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై నిరసన

● వడ్ల కుప్పపై డీజిల్‌పోసి నిప్పంటించే యత్నం

జగిత్యాలరూరల్, మే 19: ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం గోపాల్‌రావుపేట ఐకేపీ సెంటర్‌లో అదే గ్రామానికి చెందిన అంబటి సందీప్ అనే యువ రైతు తన ధాన్యాన్ని 27 రోజులు గడిచినా అధికారులు తూకం వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ తన వడ్ల కుప్పపైన డీజిల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న స్థానిక రైతులు రైతును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతు సందీప్ మాట్లాడుతూ అధికారులు పట్టించుకోకపోవడంతోనే కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందన్నాడు. తూకం వేయమంటే ఏదో కారణం చెబుతూ ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదన్నారు. లారీలు, రైస్‌మిల్‌ను రైతులే మాట్లాడుకోవాలని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారన్నారు. ఐకేపీ సెంటర్‌లో కనీస మౌలిక వసతులులేవని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ నిర్వాహకులు తమకు అనుకూలంగా ఉన్నవారి ధాన్యాన్ని మాత్రమే త్వరగా తూకం వేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇప్పటివరకు సెంటర్‌లో 30 శాతం కొనుగోళ్లు మాత్రమే జరిగాయని, మిగతా 70 శాతం ధాన్యం ఐకేపీ సెంటర్‌లోనే మగ్గుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. వాతావరణం మార్పుల వల్ల వర్షం వచ్చే అవకాశం ఉండడంతో జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట స్థానిక రైతులు, మహిళలు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాలపై ఆసక్తి చూపని రైతులు

● మండల సమాఖ్యల ఆధ్వర్యంలో కొనుగోళ్లు
● మూలనపడ్డ ట్రాక్టర్, యంత్రాలు

మల్యాల, మే 19: స్వశక్తి మహిళల ఆర్థికాభివృద్ధి, రైతులకు తక్కువ అద్దె ధరలకు వ్యవసాయ యంత్రాలు సమకూర్చడానికి మండల సమా ఖ్యల ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్, పరికరాలపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వ్యవసాయ యంత్రాలు నిరూపయోగంగా మారాయి. రైతులకు తక్కువ అద్దెపై సాగు చేసుకోవడంకు గాను దున్నడం తదితర వాటి కోసం ట్రాక్టర్, ట్రాలీ , రోటో వేటర్, కల్టివేటర్. వరి నాటు యంత్రాలు తదితరవి జిల్లాలోని 15మండ లాలల్లో గల ఐకేపీ మండల సమాఖ్యల ఆధ్వర్యంలో గత ఏడాది క్రితం రూ.12.67లక్షల వ్యయంతో కొనుగోలు చేశారు. ఈ యంత్రాలను మండల సమాఖ్య ఆధ్వర్యంలో రైతులకు అద్దె ఇవ్వడానికి గాను కొనుగోలు చేయగా వాటి పట్ల రైతులు మక్కువ చూపడం లేదు. అద్దెకు నగదు చెల్లించి తీ సుకెళ్లడం అనాసక్తికి కారణంగా తెలుస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ పను లు చేసిన అనంతరం పంటల దిగుబడి అయ్యాక ట్రాక్టర్ యజమానులకు డబ్బులు చెల్లిస్తుండగా ఇక్కడ మాత్రం ముందు చెల్లింపుల పట్ల రైతులు వీటిని తీసుకెళ్లడం లేదు. మల్యాలలో గల ఈ యంత్రాలను మ్యాడంపల్లికి చెందిన ఓ రైతుకు అద్దెకు ఇవ్వగా అతను సకాలంలో


మల్యాల సెర్ప్ కార్యాలయం వద్ద ట్రాక్టర్, యంత్ర పరికరాలు

అద్దె చెల్లించకపో వడంతో డబ్బుల కోసం మహిళ సమాఖ్య ప్రతి నిధులు, ఐకేపీ అధికారులు, రైతు మధ్య గొడవలు కూడా జరిగాయి. పోలీస్‌స్టేషన్ వరకూ గొడవ వెళ్లే క్రమంలో డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. దీంతో వాటి నిర్వహణ మండల సమాఖ్యకు తలకుమించిన భారంగా మారింది.

● భారంగా మెయింటనెన్స్..

ట్రాక్టర్ మెయింటనెన్స్ భారంగా మారుతోంది. ఏడాది క్రితం కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రాలీ ఇతరాత్ర వ్యవసాయ పరికరాలకు అద్దె ఎడాదికి కేవలం రూ.1.20లక్షలు రాగ వాటి నిర్వహణ ఖర్చులు రూ.30వేల పైగానే అయ్యాయి. పైగా ఆ యంత్రాలు మరింత మరమ్మతులకు గురయ్యాయి. మండల సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసిన వీటి డబ్బులతో ఆశించిన ప్రయోజనం రాకపోవడంతో సమాఖ్య ప్రతినిధులు ప్రభుత్వానికి మొరపెట్టుకోవడంతో ఇటీవల రూ.10లక్షలు, యూనిట్ సబ్సిడీ కింద రూ.4లక్షలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయగా మండల సమాఖ్యల సొమ్ములు తిరిగివచ్చినట్లు అయినప్పటికీ ట్రాక్టర్, వ్యవసాయ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. వాటిని సద్వి నియోగం చేసుకుంటే మండల సమాఖ్యలకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు దీనిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

● రైతులు ఆసక్తి చూపడం లేదు

రాజయ్య, ఏపీఎం, ఐకేపీ మల్యాల

ట్రాక్టర్, ట్రాలీ ఇతర వ్యవసాయ యంత్రాలను అద్దెకు తీసుకెళ్లడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో వాటిని తమ కార్యాలయం వద్దే ఉంచాము. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. తగిన అద్దె వస్తేనే యంత్రాలను అద్దెకు ఇవ్వాల్సి ఉంటుంది. రైతులు కూడా సద్వినియోగం చేసుకుంటే మేలుగా ఉంటుంది.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

చందుర్తి, మే 19: కుటుంబ కలహాలతో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఈక శేషవ్వ (45) అనే మహిళ ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రించిన అనంతరం గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి తలుపులు పెట్టుకొని, తీయక పోయేసరికి కిటికీలో నుంచి చూడగా ఉరి వేసుకుని కనిపించింది. మృతురాలికి భర్త రవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, మే 19: జమ్మికుంట-బిజిగిరి షరీఫ్ రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) రైలు కింద పడి ఆదివారం మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. నలుపు రంగు నైట్ ప్యాంట్, నీలి రంగు ఫుల్ షర్ట్, క్రీమ్ కలర్ కట్ డ్రాయర్ అంచుపైన ఎమ్ఆర్‌జి ఆర్ఈడి అని రాసి ఉంది. ఎడుమ చేయి దండ రెక్క కింద ఒక పుట్టు మచ్చ, నలుపు రంగు వెంట్రుకలు, పిల్లి గడ్డం, చామనఛాయతో ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ తెలిపారు.

లారీ, వ్యాన్ ఢీ : ఒకరి మృతి



బ్రిడ్జిపై ఎదురెదురుగా ఢీ కొన్న లారీ, వ్యాన్, రాజేశ్వర్‌రెడ్డి(ఫైల్)

కొడిమ్యాల, మే 19 : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో ఉన్న బ్రిడ్జిపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత లారీ వ్యాన్ ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన దామెర రాజేశ్వర్‌రెడ్డి వ్యాన్‌లో కరీంనగర్‌లో పాలను లోడు చేసుకొని భీంగల్‌కు బయల్దేరాడు. మార్గ మధ్యలో మండలంలోని పూడూర్ గ్రామ శివారులో గల బ్రిడ్జి వద్ద రాత్రి (జీజే- 25-యు-9696) నెంబరు గల లారీ ఎదురుగా వస్తున్న పాల వ్యాన్‌ను వేగంగా ఢీకొట్టాడు. దీంతో లారీ అదుపు తప్పి వ్యాన్‌పై పడటంతో వ్యాన్ డ్రైవర్ రాజేశ్వర్‌రెడ్డి(43)కి తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోని మృతి చెందాడు. రాజేశ్వర్‌రెడ్డి భార్య దామెర వనజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంతో బ్రిడ్జిపై లారీ బోల్తా పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొడిమ్యాల ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్థుల సహకారంతో సంఘటన స్థలంలో వాహనాలను క్రేన్‌లతో తొలిగింశారు. బ్రిడ్జిపై నుంచి వాహనాలు రాక పోకలు సాగించడానికి పోలీసులు సుమారు 10 గంటలు శ్రమించారు. అనంతరం బ్రిడ్జిపై నుంచి రాకపోకలు పునరుద్ధరించారు.

నాగంపేటలో వ్యక్తి అదృశ్యం


భూమాగౌడ్

గంభీరావుపేట, మే 19: గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన కోళ భూమాగౌడ్ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. కోల భూమాగౌడ్ ఈనెల 15న బుధవారం గొల్లపల్లికి సామాను తీసుకొని వస్తానని ద్విచక్రవాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. వారి బంధువులు ఎంత గాలించినా భూమగౌడ్ ఆచూకీ లభించలేదు. సమీప బంధువుల గ్రామాలకు వెళ్లి వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీస్ స్టేషన్లో భూమాగౌడ్ కూతురు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఈత వనం దగ్ధం


ఈతవనంలో చెలరేగుతున్న మంటలు

కోరుట్ల రూరల్, మే 19 : మండలంలోని చిన్నమెట్‌పల్లి - వెంకటాపూర్ గ్రామల మధ్యలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో ఈత వనం దగ్ధమైనట్లు గ్రామస్థులు, గౌడ సంఘ నేతలు ఆధివారం తెలిపారు. వ్యవసాయ క్షేత్రంలో రైతులు వ్యర్థాలను కాల్చడానికి ప్రయత్నిస్తున్న సమయంలో గాలికి ఆ ప్రాంతంలో ఉన్న ఈత వనంకు అంటుకున్నట్లు వారు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకరావడానికి రైతులతో పాటు గౌడ సంఘాలు ప్రయత్నం చేసి అదుపులోకి తీసుకవచ్చారు. సుమార్ 300 వరకు ఈత చెట్లు దగ్ధం అయినట్లు గ్రామస్థులు తెలిపారు.

ధర్మపురిలో వైభవంగా పల్లవోత్సవం, వసంతోత్సవం


వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న భక్తులు

ధర్మపురి, మే 19: ధర్మపురి నరసింహ నవరాత్రోత్సవాలు ఏడవ రోజు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడ షోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మన్యసూక్త, రుద్రాభిషేకం, పంచోపనిషత్తులచే విశేష పూజలు, సప్త హారతులు, మహా నివేదన, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లవోత్సవం, వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఆలయ మండపంలో అందంగా వివిధ రకాల చెట్ల కొమ్మలతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. గోధూళి సుమూహూర్తమున అర్చకులు స్వామి వారల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠ పైకి తీసుకవచ్చి ఆశీనులు చేశారు. అనంతరం పంచోపనిషత్తుల పారాయణ పూర్వకంగా వేద మంత్రాలు పఠించారు. పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాది కార్యక్రమాలు జరిపి పల్లవోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారలను దర్శించుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మెడికల్ కళాశాల పనులను అడ్డుకున్న రైతులు

● నష్టపరిహారం ఇచ్చిన తరువాతనే నిర్మాణం చేపట్టాలి ● హద్దుల కోసం ఏర్పాటు చేసిన కర్రలు దహనం


భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్న రైతులు


మెడికల్ కళాశాల వద్ద హద్దుకర్రలను దహనం చేస్తున్న రైతులు

సిరిసిల్ల రూరల్, మే 19: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణాలను రైతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం అడ్డుకున్నారు. నూతన భవనాల నిర్మాణాల హద్దుల కోసం ఏర్పాటు చేసిన కర్రలను తీసి రైతులు దహనం చేశారు. పెద్దూర్ శివారులోని సర్వేనంబర్ 408లో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను గతంలో జీవనోపాధికోసం భూములు లేని వారికి అప్పటి ప్రభుత్వాలు అందించాయి. ఆ భూములపై అధారపడి జీవిస్తున్న రైతులకు గత ప్రభుత్వం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతో అప్పటి మంత్రి కేటీఆర్, జిల్లా కలెక్టర్ సదురు భూములకు చెందిన రైతులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి మరో చోట వాణిజ్య పరమైన భూములను అందిస్తామని హామీ ఇచ్చి మెడికల్ కళాశాల కోసం 40 మంది రైతులకు చెందిన 36 ఎకరాలను తీసుకున్నారు. వెంటనే అందులో మెడికల్ కళాశాలను నిర్మించి ప్రారంభించారు. నష్టపరిహారంతో పాటు ఇచ్చిన హామీ ప్రకారం భూములను ఇవ్వాలంటూ రైతులు అధికారుల చుట్టుతిరిగినా ఎలాంటి స్పందన లేకపోవడంతో మిగతా భూముల్లో నిర్మాణాలను అడ్డుకుకోవాలని రైతులు నిర్ణయించారు. అయితే గత నెల ఏప్రిల్ నెలలో అదనపు భవనాల నిర్మాణాలను చేసేందుకు కాంట్రాక్టర్ రావడంతో ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని నిర్మాణాలను అపాలంటూ వారం రోజుల పాటు రైతులు అందోళనలు చేపట్టారు. దీంతో కలెక్టర్ స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని అర్డీవోను అదేశించారు. అర్డీవో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అదే ప్రాంతంలో ఉన్న భూములను రైతులతో కలిసి అర్డీవో రమేష్ పరిశీలించి అందులో భూములను అందిస్తామని హామీ ఇచ్చినా ఎలాంటి ఫలితం లేదు. భవనాలను నిర్మించేందుకు కాంట్రాక్టర్ అదివారం అక్కడి చేరుకుని నాగుల లక్ష్మికి చెందిన భూమిలో హద్దులను ఏర్పాటు చేయడంపాటు నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని వేయడంతో ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని హద్దులను వేయకుండా అడ్డుకున్నారు. హద్దుల కోసం ఏర్పాటు చేసిన కర్రలను తొలగించి అక్కడే దహనం చేశారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ ఉలిసే తిరుపతి, నాగుల లక్ష్మీ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బీర్‌పూర్,మే 19:బీర్‌పూర్ మండలంలోని నర్సింహుల పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి 14 క్వింటాల్ రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన కోట సంతోష్ అనే వ్యక్తి నర్సింహులపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యన్ని తరలించడానికి సిద్ధంగా ఉన్నడన్న పక్క సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి 14 క్వింటాల్ రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వీరివెంట ఏఎస్సై గజేందర్, కానిస్టేబుళ్ళు ముత్తయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక


సదస్సులో ప్రసంగిస్తున్న అధ్యాపకుడు మల్లేశం

హుజూరాబాద్‌రూరల్, మే 19: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న లింగబత్తిని మల్లేశం అంతర్జాతీయ సదస్సుకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ హనుమకుమార్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు హైద్రాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 17,18వ తేదీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు చేస్తున్న సామాజిక సేవపై మాట్లాడి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక కావడం పట్ల కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మానకొండూర్, మే 19 : మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన భారతి కనకవ్వ అనే మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు స్థానిక సీఐ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లింగాపూర్‌కు చెందిన కనకవ్వకు జ్వరం రావడంతో అదే గ్రామానికి చెందిన మమత అనే ఆర్ఎంపీ వైద్యురాలు వేసిన ఇంజక్షన్ వికటించి తీవ్ర అస్వస్థతకు గురి అయిందని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని సీఐ తెలిపారు.

పెద్దూర్ శివారులో ఇసుక డంప్‌లు


ఇసుకడంప్

సిరిసిల్ల రూరల్, మే 19: సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూరు శివారులోని అపెరల్ పార్కు ప్రాంతంలో ఇసుక డంప్ చేశారు. సిరిసిల్లలో ఇసుక రవాణాకు పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులు అంక్షలు విధించడంతో ఇసుక దొరకడం కష్టంగా మారింది. ఇసుకకు డిమాండ్ ఉండడంతో పెద్దూర్, సర్ధాపూర్‌కు చెందిన కొంత మంది ఇసుక స్మగ్లర్లు ఆదివారం గ్రామ శివారులో డంప్ చేసి రాత్రిపూట లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామ శివారులో ఉన్న ఇసుక డంప్‌లను సీజ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంకర దారిపై కష్టాలెన్నో?


రోడ్డుపై కంకర

ఎల్లారెడ్డిపేట, మే 19: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట నుంచి గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట వరకు రహదారి పనులు కొనసాగుతున్నాయి. రూ 1.90కోట్ల నిధులతో తలపెట్టిన పనులు ఏడు నెలలుగా సాగుతూనే ఉన్నాయి. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర రహదారిపై ప్రయాణించే వారు జల పైలం మరి.

ఘనంగా కొండస్వామి బ్రహ్మోత్సవాలు

మెట్‌పల్లి రూరల్, మే, 19 : మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండపై వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా బండలింగాపూర్ సంస్థాన్ నుంచి జగ్గసాగర్ ఆలయంలోని ఉత్సవ మూర్తులను తీసుకరావడం అనవాయితీగా వస్తోంది. ఉత్సవమూర్తులను డప్పు చప్పుల మధ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో ఏర్పాటు చేసి శోభయాత్రగా గ్రామంలోని కొండస్వామి ఆలయానికి గంగపుత్రులు తీసుకొచ్చారు. ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసిన పురోహితులు అభిషేకాలు, అర్చనలు అలంకరణ, పూజలు, హారతి కార్యక్రమాలను జరిపారు. ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గంగపుత్రులు, భక్తులు పాల్గొన్నారు.


ఊరేగింపుగా ఉత్సవ మూర్తులను తీసుకొస్తున్న గంగపుత్రులు

పంటపొలాల్లో అగ్ని ప్రమాదం

గంగాధర, మే 19: గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ శివారులో కోసిన వరిపొలంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. పశుగ్రాసం, పొలాలకు నీటి సరఫరా కోసం వేసిన పైపులు, విద్యుత్ వైర్లు కాలిబూడిదయ్యాయి. మంటలకు గాలి తోడవడంతో ఒక్కసారి వ్యాపించాయి. నాగిరెడ్డిపూర్‌కు చెందిన సిరికొండ మధు పొలంలో పరదాల్లో కుప్పపోసిన ధాన్యం, నాలుగు పరదాలు కాలిపోయినట్లు తెలిపారు. ఈ ఘటనలో సుమారుగా లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మంటలు అంటుకున్న సమయంలో రైతులు వాటిని ఆర్పేందుకు కరెంటు మోటార్లను ఆన్ చేశారు. అయితే అదే సమయంలో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు జరపడానికి కరెంటు నిలిపివేశారు. విద్యుత్ ఉంటే ప్రమాద తీవ్రత ఇంత ఉండేది కాదని రైతులు పేర్కొంటున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేక ఇబ్బందులు

కోనరావుపేట, మే 19: కొన్ని సంవత్సరాల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ వరద తాకిడికి కూలిపోయింది. సుమారు ఏడు సంవత్సరాలు గడిచినా నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ ఏడు సంవత్సరాల క్రితం భారీ వర్షాల వల్ల వచ్చిన వరద తాకిడికి కూలిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టకపోవడంతో పశువులు లోపలికి వెళ్లి మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. అంతే కాకుండా ప్రహరీ లేకపోవడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.


కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెళ్లి కాలేదని చెప్పి రెండో వివాహం

● పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు ● నిందితుడిపై కేసు

కరీంనగర్ క్రైం, మే 19 : తనకు తల్లిదండ్రులు లేరని, పెళ్లి కాలేదని అబద్ధాలు చెప్పి మొదటి భార్య ఉండగానే మళ్లీ వివాహం చేసుకుని యువతిని మోసం చేసిన వ్యక్తితో పాటు అతడి కుటుంబ సభ్యులపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌కు చెందిన యువతి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఆధ్యాపకురాలిగా పనిచేస్తున్నది. ఆమె తండ్రి మరణించగా సోదరుడు ఆమెకు వివాహ సంబంధాల కోసం 2021లో వావిలాలపల్లిలోని మ్యారేజ్‌బ్యూరోలో సంప్రదించాడు. హైదరాబాద్‌కు చెందిన ఒక సంబంధం వచ్చినట్లు, అబ్బాయి వివరాలను మ్యారేజిబ్యూరో నిర్వాహకులు బాధితరాలుకు ఇచ్చారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న రాంనగర్‌లోని ముషీరాబాద్‌కు చెందిన సీహెచ్ వెంకట రాఘవేంద్రరావుతో సంప్రదింపులు జరపగా అతనికి వివాహం కాలేదని, తల్లిదండ్రులు లేరని చెప్పాడు. ఇద్దరు పరస్పరం ఇష్టపడ్డారు. ఈ మేరకు వెంకటరాఘవేంద్రరావు, అతని పిన్నిగా సత్యవతి అనే మహిళతో వచ్చి 2021 ఆగస్టు 25న కరీంనగర్‌లో వరపూజ చేసుకున్నారు. అదే సమయంలో 5 లక్షల నగదు, 2 తులాల బంగారనం వరకట్నం ఒప్పుకుని 50 వేల రూపాయలు ముట్టజెప్పారు. పెళ్లికి ఎవరినీ ఆహ్వానించవద్దని వెంకటరాఘవేంద్ర కోరగా కుటుంబ సభ్యుల సమక్షంలోనే 2022 జూన్ 26న ఎల్ఎండీ లక్ష్మినర్సింహస్వామి దేవాలయంలో ఇద్దరు వివాహం చేసుకున్నారు. పెళ్లి అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి రాంనగర్ ప్రాంతంలో గది అద్దెకు తీసుకుని ఉన్నారు. వారానికి రెండు మూడు రోజులు ఇంటి వద్ద ఉండి ఆఫీస్ పనిఉందని మిగతా రోజులు ఇంటికి వచ్చేవాడు కాదు. అనుమానం వచ్చి ఆరాతీయగా ఉద్యోగం చేస్తున్న విషయం నిజమేనని వెల్లడైంది. వెంకటరాఘవేంద్ర ఆధార్‌కార్డు చిరునామా ఆధారంగా అతని ఇంటికి వెళ్లగా అతని ఇంటిలో తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు, మొదటి భార్య ఉన్నారు. దీనిపై వెంకటరాఘవేంద్ర నిలదీయగా కులం పేరుతో దూషించి, చేతులతో కొట్టి బెదిరించాడని బాధితురాలు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాజన్న క్షేత్రానికి పెరిగిన భక్తుల తాకిడి

- రెండు గంటలపాటు క్యూలైన్‌లో భక్తుల నిరీక్షణ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, మే 19: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రాజన్న ఆలయానికి చేరుకున్న భక్తులు ఆదివారం ఉదయం స్వామి వారి ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారు రెండు గంటలపాటు నిరీక్షించి పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్న అనంతరం కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని రాజన్నను దర్శించుకున్నారు. తదనంతరం అనుబంధ ఆలయాల్లో భక్తులు కుంకుమ పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

● బద్దిపోచమ్మకు మొక్కులు..

వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు అనబంధ ఆలయమైన శ్రీభీమేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి వారి ఆలయాలతో పాటు బద్దిపోచమ్మ ఆలయాలను దర్శించుకుంటారు. డప్పుచప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో నెత్తిన బోనంతో బద్ది పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఒడిబియ్యం అందజేసి నైవేద్యాన్ని సమర్పించి పిల్లపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందుల తలేత్తకుండా ఉండేందుకు ఆలయాధికారులు ఏర్పట్లను పర్యవేక్షించారు.

రాజన్న ఆలయంలో అంతర్గత బదిలీలు

వేములవాడ టౌన్, మే 19: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు అధికారులకు స్థానచలనం జరిగినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. సూపరింటెండెంట్ నాగుల మహేష్‌కు ప్రింటింగ్ స్టేషనరీ, ఆడిట్, ఈ టికెటింగ్, కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ కల్యాణమండపం, ప్రచారం రథంతో పాటు ఆలయ చౌల్ట్రీస్‌ల బాధ్యతలు అప్పగించారు. జి నర్సింహామూర్తి సూపరింటెండెంట్‌కు ప్రసాదం తయారి కేంద్రంతో పాటు గోశాల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ ఎల్ రాజేందర్‌కు అన్ని శాఖల రికార్డు మెంటనెన్స్‌తో పాటు గోశాల సెక్షన్‌ను, అసిస్టెంట్ అంజయ్యకు బద్దిపోచమ్మ ఆలయ అర్చన టికెట్స్ కౌంటర్ విభాగాన్ని కేటాయించినట్లు ఈవో ఆదివారం ఉత్తర్వులు అందజేసినట్లు తెలిసింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఇల్లంతకుంటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఇల్లంతకుంట, మే 19: ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆకట్టుకుంది. మండల కేంద్రంలో 2006-2007 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆదివారం స్థానిక ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో చదువు చెప్పిన గురువులు కిషన్, నరేందర్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్, మంగళ, దీపికలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసరెడ్డి, సుధాకర్, యాదగిరి, శివరాం, సంతోష్, భూపతి, అనిల్, దీప, రమ్య, సమత, భవాని, సునీతలు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం కనగర్తి గ్రామములో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకొని వారి జ్ఞాపకాలను పంచుకున్నారు. 1996-97 సంవత్సరంలో కనగర్తి పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు కలుసుకొని తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం భోజనాలు చేసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



కనగర్తిలో..

నియామకం

ముస్తాబాద్, మే 19: రాజన్న సిరిసిల్ల జిల్లా గల్ఫ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన తోట ధర్మేందర్‌ను ఏకగ్రీవంగా నియమించారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ఛైర్మన్ డాక్టర్ వివిం వినోద్‌కుమార్ ఆదివారం ఈమేరకు నియామక పత్రాన్ని అందజేశారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పట్ల కృషి చేస్తానని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమస్యలు వినతి చేసి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్రగల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, టీపీసీసీ ఇంటర్నేషనల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, మహిపాల్, జంగ రాఉ, సంతోష్, రాజశేఖర్ తదితతరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానకు సుస్తీ

- తాళం వేసి వుండటంతో స్థానికుల ఆగ్రహం
- పట్టించుకోని సంబంధిత అధికార యంత్రాంగం
- నిరంతర పర్యవేక్షణ ఉండాలని పట్టణవాసులు వేడుకోలు

వేములవాడ టౌన్, మే 19: పట్టణాల్లో నివసిస్తున్న నిరుపేదలకు మంచి ఆరోగ్యాన్ని ఏ మాత్రం ఖర్చులేని వైద్య సదుపాయాన్ని బస్తీల్లోకి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారు. వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్ ప్రాంతంలోని రాజన్న ఆలయ శ్రీలక్ష్మిగణపతి వసతి గదుల్లోని కొంత భాగంలో బస్తీ దవాఖానను ఏర్పాటు చేశారు. వేములవాడ పట్టణ ప్రజలతో పాటుగా, రాజన్న క్షేత్రానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తారని భక్తుల సౌకర్యార్థం ఉపయోగపడుతుందని ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. స్థానికులు బస్తీ దవాఖాన తెరిచి ఉండటం లేదని 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకురావడంతో బస్తీ దవాఖానాను శనివారం సందర్శించగా ఆసుపత్రికి తాళం వేసి వుంది. బస్తీ దవాఖానాను తెరవడం లేదని తరుచూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా డీఎంహెచ్‌వోను సంప్రదించగా బస్తీ దవాఖానా తెరిచే ఉందని, ఒక వైద్యుడు, ఒక స్టాఫ్‌నర్స్ డ్యూటీలో ఉన్నారని తెలిపారు. శనివారం తాళం వేసి ఉందని తరచు ఆసుపత్రి తీయడం లేదని డీఎంహెచ్‌వో దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లడంతో తమ దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం.

● బస్తీ దవాఖానలో అందే సదుపాయాలు..

బస్తీ దవాఖానాలో రోగులకు సాధారణ జబ్బులకు ఉచిత చికిత్స, అంటు వ్యాధులకు చికిత్స, తల్లిబిడ్డల సంరక్షణ, గర్భిణులకు, శిశువులకు టీకాలు, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి సాధారణ ఆరోగ్య సమస్యలకు మందుల పంపిణీ, ఇతర జబ్బులు, వ్యాధులు గుర్తించడం, ఉచిత వైద్య పరీక్షలు, మందులను పంపిణీ చేయాల్సి వుంటుంది. ఉచిత వైద్య పరీక్షల్లో తీవ్రమైన వ్యాధులు, ప్రత్యేక చికిత్సల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేద, ఏరియా ఆసుపత్రులకు పంపించేందుకు అనుసందానం చేయాల్సి వుంటుంది. అయితే దవాఖానాకు వచ్చే రోగులకు చేదు అనుభవం ఎదురవుతుంది. ఎప్పుడు వచ్చినా తాళం వేసి ఉండటంతో రోగులు నిరాశతో తిరిగి వెళుతున్నారని పట్టణ వాసులు చెబుతున్నారు.

● బస్తీ దవాఖానాకు తాళం..

వేములవాడ పట్టణంలోని బస్తీ దవాఖానాకు శనివారం తాళం వేసి ఉంచారు. డాక్టర్, సిబ్బంది రాకపోవడంతో తాళం వేసి ఉందని స్థానికులు తెలిపారు. దవాఖానను తెరవడం లేదని ఎప్పుడు చూసిన తాళం వేసి ఉంటుందని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్తీ దవాఖానపైన జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని బస్తీదవాఖానను నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.



వేములవాడలో తాళం వేసివున్న బస్తీ దవాఖానా

● బస్తీ దవాఖానాను నిత్యం తెరిచే ఉంచాలి..

- సుమన్ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో, సిరిసిల్ల

వేములవాడలో బస్తీ దవాఖాన ఏర్పాటు చేశాము. ప్రతి నిత్యం బస్తీ దవాఖానాను తెరిచే వుంచుతున్నారు. ఆసుపత్రికి తాళం వేసి ఉందన్న విషయం మా దృష్టికి రాలేదు. ప్రతీ రోజు బస్తీ దవాఖాన తెరిచే వుంటుందని అనుకుంటున్నాము. ఒక డాక్టర్‌తో పాటు స్టాఫ్ నర్స్ ప్రతి నిత్యం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిని తెరిచివుంచి రోగులకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. విచారణ చేసి చర్యలు తీసుకుంటాము.

విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి..

- మారం కుమార్, మూడో వార్డు కౌన్సిలర్, వేములవాడ



ఏరియా ఆసుపత్రి పట్టణానికి దూరంగా వుండటంతో పట్టణంతో పాటు, రాజన్న ఆల యానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్త కుండా ఉండేందుకు బస్తీ దవాఖానాను ఏర్పాటు చేశారు. సంబంధిత వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకుండా ఆసుపత్రిని మూసివేసి తాళం వేసి ఉంచడం విధుల్లో నిర్లక్ష్యం వహించనట్లుగా వుంది. జిల్లా స్థాయి ఉన్నతాధి కారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. నగటు నిరుపేద ప్రజలకు ఉచిత వైద్యం, ఉచిత మందుల పంపిణీ అందించాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసి పథకం నీరుగారిపోవడం హేయమైన చర్యగా తీసుకుంటున్నాము.

నిరంతర పర్యవేక్షణ చేయాలి..

- రేగుల సంతోష్‌బాబు, 20వ వార్డు కౌన్సిలర్, వేములవాడ



ధార్మిక క్షేత్రాంగా వీరజిల్లే రాజన్న ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. స్థానిక పట్టణ ప్రజలకు అత్యవసరం చికిత్స అందించాలనే ఉద్దేశంతో బస్తీ దవాఖానను ఏర్పాటు చేశారు. ఆసుపత్రిపై నిర్లక్ష్యం చేయడం ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యమే, జిల్లా స్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలి. అప్పుడు పేద ప్రజలకు వైద్యం చేరువవుతుంది.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ.. అవస్థలు పడుతున్న ప్రజలు

- ఇళ్ల ఆవరణలోకి చేరుతున్న మురుగు - పట్టించుకోని అధికారులు.. జ్వరాల బారిన పడుతున్న ప్రజలు



కూలినపోయిన మురుగు నీటి కాల్వ

ఎల్లారెడ్డిపేట, మే 19: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 10 వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు నీరు ఇళ్ల ఆవరణలోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు విజృభిస్తున్నాయి. జ్వరాల బారిన పడుతున్నామని విన్నవించిన సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని జనాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందులు, కుక్కల సంచారం ఓ వైపు.. మురుగు నీరు మరో వైపు తమను అవస్థలకు గురి చేస్తున్నాయని వాపోతున్నారు.

● కంపు కొడుతున్న కాలనీ..

మండల కేంద్రంలోని 10 వార్డులో ఎళ్ల కిందట నిర్మించిన డ్రెయినేజీ దెబ్బతింది. మరమ్మత్తు చర్యలు చేపట్టకపోవడం వల్ల ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ఇళ్ల ఆవరణలోకి చేరుతోంది. సుమారు 50 కుటుంబాలలో మొత్తం 200 మంది నివసిస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి కిందకు పారుతున్న మురుగు నీరు కాల్వ సరిగా లేకపోవడం వల్ల నీరంతా చేరి అపరిశుభ్రంగా మారుతోంది. కాల్వను శుభ్రం చేయకపోవడంతో కాలనీ కంపు కొడుతోంది. ఇళ్లలోని పురుగులు వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి డ్రెయినేజీకి మరమ్మత్తు పనులు చేయడంతో పాటు తమ కంపు కష్టాలను తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

● సార్లకు ఫిర్యాదు చేసిన పట్టించుకుంటలే

- నేవూరి శ్రీకాంత్‌రెడ్డి, కాలనీ యువకుడు



మా వార్డులో మురుగు నీటి కాల్వ దెబ్బతిని చాలా కాలం అవుతోంది. నీరంతా ఇళ్ల సమీపంలోకి చేరుతోంది. పురుగులు, వ్యర్థాలు కొట్టుకు వచ్చి ఇళ్ల వద్ద నిలుస్తున్నాయి. వాసన భరించలేకపోతున్నాం. డ్రెయినేజీ పనులు చేయాలని సార్లకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకుంటలేరు. జ్వరాల బారిన పడుతున్నాం. సార్లు స్పందించి మరమ్మతు చేయించాలి.

పనులను ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తాం

- దేవరాజు, పంచాయతీ కార్యదర్శి



మండలంలోని 10 వార్డులో పూర్తిగా దెబ్బతిన్న డ్రెయినేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ వల్ల పనులను ప్రారంభించలేదు. త్వరలో డ్రెయినేజీ పనులను ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తాం.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

వేములవాడ టౌన్, మే 19: ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రాస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చీర్లవంచ గ్రామానికి చెందిన మానువాడ అనిల్ (32) అనే యువకుడు కుటుంబ కలహాలతో ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మకు పాల్పడ్డాడు. అనిల్ తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబందం పెట్టుకున్నాడని, విషయం తెలిసిన భార్య మందలించడంతో భార్యను చితకబాది పుట్టింటికి పంపించాడని తెలిపారు. నాలుగు రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై టౌన్ సీఐని వివరణ కోరగా మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ బోనాల పండుగ

కోనరావుపేట, మే 19: కోనరావుపేట మండలం మర్తనపేటలో గ్రామస్థులు పోలేరమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం మరుసటి రోజున పోలేరమ్మ బోనాల పండుగను ఆనవాయితీగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి వెళ్లి కుటుంబ సభ్యులు పాడిపంటలు బాగుండాలని నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం వితరణ

ముస్తాబాద్, మే 19: మండలంలోని పోతుగల గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు వేములువాడలోని రాజన్న కోడేలకు నాలుగు ట్రాక్టర్ల పశుగ్రాసం వితరణ చేశారు. గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు వేమువాడలోని దేవస్థానంలో కోడెలకు పశుగ్రాసాన్ని అందించారు. గత అయిదేళ్లుగా కోడెలకు పశుగ్రాసాన్ని అందించటం పట్ల సర్పంచ్ తన్నీరు గౌతంరావు మామిండ్ల నరేశ్, కంచం మల్లయ్య, కంచం నర్సయ్య, తలారి అశోక్, శ్రీకాంత్, ఈర్ల నరేశ్ తదితరులు అభినందించారు.

కోనరావుపేట: దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని కోడెలకు ఆదివారం పశుగ్రాసాన్ని ట్రాక్టర్ ద్వారా అందజేశారు. మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన ఈర్ల పరుశరాములు తన సొంత ఖర్చులతో ట్రాక్టర్ పశుగ్రాసాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.



పశుగ్రాసాన్ని పంపిస్తున్న పోతుగల్ మాజీ సర్పంచ్ గౌతంరావు

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



రుద్రంగిలో మాట్లాడుతున్న చెన్నమనేని వికాస్‌రావు



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న వెన్నమనేని శ్రీధర్‌రావు

రుద్రంగి, మే 19: కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలను ఆదివారం బీజేపీ నాయకులతో కలిసి బీజేపీ రాష్ట్ర నాయకుడు వికాస్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా చెన్నమనేని వికాస్‌రావు మాట్లాడుతూ కొనుగోల్లలో జాప్యం జరుగుతోందని తక్షణమే తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా అని చెప్పి రైతులను ఆగం చేస్తోందన్నారు. తక్షణమే పెట్టుబడి సహాయం పదిహేను వేల రూపాయలు, రైతు కూలీలకు పన్నెండు వేలు, పంట ధాన్యానిని ఐదు వందలు బోనస్, రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యడాపు వెంకటేష్, మండల అధ్యక్షులు అల్లూరి అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు పడాల గణేష్, అల్లూరి రవీందర్ రెడ్డి, పందుగు గంగాధర్, నెవూరి కిషన్, మోతే నితిన్, కంటే నవీన్, మర్రిపెల్లి దశరథం, దర్నా దేవయ్య, నంద్యాడపు తిరుపతి, బాల కిషన్ రావు, రాచకొండ గంగా నర్సయ్య, మర్రిపెల్లి లక్ష్మిరాజం, పడల పవన్, కదా నర్సయ్య, పాల్గొన్నారు

● రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..

తంగళ్లపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రుణమాఫీ, వరి ధాన్యానికి బోనస్ తదితర ఎన్నో హామీలను ఇచ్చి నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాళీచరణ్, ఉపాధ్యక్షులు ఇటికల రాజు, ఇటుకల మహేందర్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు సిలివేరి ప్రశాంత్, శక్తి కేంద్రం ఇంచార్జ్ విశ్వనాథుల బ్రహ్మచారి, రాగిశెట్టి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి గీసిన దృశ్యం



సాయం సంధ్య వేళ ఆకాశాన ఓవైపు మబ్బులు కమ్ముకుంటే.. మరోవైపు భానుడు తన అందాలతో కనువిందు చేశాడు. అస్తమిస్తూ తన అందచందాలను ఒలకబోశాడు. ప్రకృతి గీసిన దృశ్యం ఆదివారం సాయంత్రం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో చూపర్లను ఆకట్టుకుంది.

- ఎల్లారెడ్డిపేట

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- మండలంలో 23 అంగన్‌వాడీ కేంద్రాలు
- ఐదు కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు
- అరకొర వసతులతో ఇబ్బందులు



రుద్రంగిలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనం

రుద్రంగి, మే 19: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఆవసరమైన భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె గదులు, కమ్యూనిటీ హాళ్లు, ప్రాథమిక పాఠశాలలో ఇరుకుగా, ఆరకొర వసతులు ఉన్న ఆ భవనాల్లో చిన్నారులకు ఆడించాలన్నా, వారికి భోజనం పెట్టాలన్నా, చదువు చెప్పాలన్నా ఇబ్బందిగా మారింది. రుద్రంగి మండలంలో 23 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి, వాటిలో 5 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సోంత భవనాలు ఉన్నాయి. 8 అద్దె భవనాల్లో కోనసాగుతున్నాయి. 10 అంగన్‌వాడీ కేంద్రాలు ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల భవనాల్లో కోనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు లేక పోవడంతో నిర్వహకులు ఇబ్బందులు పడుతున్నారు. రుద్రంగిలోని అంగన్‌వాడీ కేంద్రం- 3, అలాగే కోచ్చగుట్ట తండాలో ఉన్న అంగన్‌వాడీ భవనాలు గత 7 సంవత్సరాల క్రితం నిధులు సరిపోకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఆప్పటి నుండి ఇప్పటి వరకు ఆ భవనాలను పట్టించుకోకపోవడంతో ఆసాంఘిక కార్యకలపాలకు ఆడ్డగా మారాయి. ఇప్పడికైనా పాలకులు, ఆధికారులు ఆసంపూర్తిగా ఉన్న భవనాలకు నిధులు కెటాయించి పనులు త్వరగా పూర్తి చేయాలని, ఆలాగే మండలంలోని ఆన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు నిదులు కెటాయించి పక్క భవనాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

- మనోహర్, పంచాయతీరాజ్ ఏఈ, రుద్రంగి



రుద్రంగి మండల కేంద్రంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులు మధ్యలో నిలిచిపోయాయి. అంగన్‌వాడీ కేంద్రాల అసంపూర్తి భవనాల నిర్మాణం కోసం ఇటీవలే ప్రతిపాదనలు పంపించాము. నిధులు మంజూరు ఆయిన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

ప్రభుత్వ భూములను రక్షించాలి

సిరిసిల్ల రూరల్, మే 19: సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వం భూములను రెవెన్యూ అధికారులు రక్షించడంతోపాటు కబ్జాదారులను శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని కార్మిక భవనంలో ఆదివారం విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. పట్టణంలోని శాంతినగర్ శివారులో సర్వేనంబర్ 1581లో రెండు ఎకరాల 10గుంటల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ప్రస్తుతం దాని విలువ రూ 25 కోట్లుపైనే ఉంటుందన్నారు. అ భూమిని పట్టణానికి చెందిన బడా నాయకుడు కబ్జాచేసి వెంచర్‌గా మార్చి రోడ్లులు వేసి విక్రయించేందుకు సిద్ధం చేశాడన్నారు. జిల్లా ప్రభుత్వం యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన నాయకుడిపై రెవెన్యూ అధికారులు ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. దీనిపై రెవెన్యూ అధికారులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. భూములను కబ్జాలు చేసిన జైళ్లలో ఉంటే సిరిసిల్లకు చెందిన నాయకుడు కబ్జాచేసి రోడ్లుపై తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సిరిసిల్ల పట్టణంలో భూమి లేని నిరుపేదలు చాలామంది ఉన్నారని వారికి అందులో ఇంటి స్థలాలను అందించాలని దీనిపై కలెక్టర్ స్పందించాలని వేణు కోరారు. రెవెన్యూ అధికారులు ఈ భూములను పరిశీలించి స్వాధీనం చేసుకోకపోతే సీపీఐ అధ్వర్యంలో పేదలను సమీకరించి భూముల్లో గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసం లక్ష్మణ్, సోమ నాగరాజు తదిరులు పాల్గొన్నారు.